


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I హైదరాబాద్, మంగళవారం 11 జూన్ 2024 | HYDERABAD







## విద్యాదాత.. జగన్మోహన్‌రావు

*దండుమైలారం గ్రామానికి చెందిన హైదరాబాద్ క్రికెట్ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు తనకు జన్మనిచ్చిన ఊరు రుణం తీర్చుకోవాలనుకున్నారు. సొంత నిధులు, రౌండ్‌టేబుల్ ఆర్గనైజేషన్ వారి సహకారంతో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు సుమారు రూ.75 లక్షలతో ప్రాథమిక పాఠశాల భవనాన్ని సకల హంగులతో ప్రైవేటుకు దీటుగా నిర్మించారు. ఆయన సేవలను వందేమాతరం ఫౌండేషన్ గుర్తించింది. సోమవారం రవీంద్రభారతిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో జగన్మోహన్‌రావుకు విద్యాదాత పురస్కారాన్ని అందించింది. వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్, మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ, సెయింట్ సంస్థ వ్యవస్థాపకులు బీవీఆర్ మోహన్‌రెడ్డి, విద్యాశాఖ కమిషనర్ దేవసేన నుంచి జగన్మోహన్‌రావు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని, గ్రామంలో ఎలాంటి ఇబ్బందులున్నా..తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని జగన్మోహన్‌రావు అన్నారు.*

*- ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 10*

## టీఏఎస్‌కు సీసీఎంబీ శాస్త్రవేత్త ఎంపిక

సిటీబ్యూరో, జూన్ 10(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలార్ బయాలజీ సంస్థలో శాస్త్రవేత్తగా సేవలు అందిస్తున్న రఘునంద్ తిరుమలై తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా ఎంపికయ్యారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంపై విస్తృత అవగాహన కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్న టీఏఎస్, పలు రంగాల్లో పరిశోధన సేవలు అందించే నిపుణులను గుర్తించి వారిని ఫెలోగా సత్కరిస్తోంది. ఈ క్రమంలోనే సీసీఎంబీలో పలు పరిశోధనల్లో కీలకపాత్ర పోషించిన రఘునంద్ తిరుమలైను ఫెలోగా ఎంపిక చేయగా... సీసీఎంబీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

# అక్రమ నిర్మాణాలపై జనం గగ్గోలు

**సమస్య పరిష్కరించకపోతే .. వచ్చే ప్రజావాణిలో ఆత్మహత్య చేసుకుంటానన్న ఉప్పల్ వాసి**

**మేయర్ ముందు కన్నీటి పర్యంతమైన ఓ మహిళ**

**మూడు నెలల తర్వాత చేపట్టిన ప్రజావాణికి వెల్లువలా ఫిర్యాదులు**

**ఇన్‌చార్జి కమిషనర్, మేయర్ ఎదుట ప్రజల ఆగ్రహం**

> సమస్యను పరిష్కరించకపోతే వచ్చే ప్రజావాణిలో 10 లీటర్ల పెట్రోల్‌తో వచ్చి ఆత్మహత్య చేసుకుంటా..
>
> - ప్రజావాణిలో ఉప్పల్ వాసి వినోద్ ఆవేదన

### క'న్నీళ్ల' ప్రజావాణి..!



సోమవారం బల్దియాలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ ) : 'గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌హిల్స్‌లో సర్వే నంబర్ 66/2లో ప్లాట్ నంబర్ 178/పార్ట్‌లో జీ+4 అంతస్తులకు అనుమతి తీసుకొని ఏడు అంతస్తుల నిర్మాణం చేపట్టారు. సెడ్‌బ్యాక్ ఉల్లంఘన భారీగా జరిగింది. ఈ అక్రమ నిర్మాణాన్ని ఆపాలని జీహెచ్‌ఎంసీ జోనల్, ప్రధాన కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఫిర్యాదు చేశాం. ప్రజాభవన్‌లో ప్రజావాణికి ఫిర్యాదు చేశాం. ఫిర్యాదును పరిష్కరించిన పాపాన పోలేదు. సదరు అక్రమ నిర్మాణంలో హాస్టల్ వచ్చేసింది. ఈ నిర్మాణంతో స్థానికంగా అనేక ఇబ్బందులు వస్తున్నాయి' అంటూ గాయత్రి అనే మహిళ జీహెచ్‌ఎంసీ ప్రజావాణి వేదికగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ముందు కన్నీటి పర్యవంతమయ్యారు. ఏడాది కాలంగా ఆమె చేస్తున్న పోరాటం ఫిర్యాదుదారులను తీవ్రంగా కలిచివేసింది. స్పందించిన మేయర్.. సీసీపీ రాజేంద్రప్రసాద నాయక్ నుంచి రెండు రోజుల్లో సమగ్ర నివేదికను తెప్పించుకుని న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఒక్క గాయత్రే కాదు.. ఉప్పల్, ఇతర ప్రాంతాల నుంచి టౌన్‌ప్లానింగ్ అధికారుల అక్రమాలు, అనధికారిక నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదుదారులు గగ్గోలు పెట్టారు.

### కాలయాపన చేస్తున్నారంటూ..

జీహెచ్‌ఎంసీలో విధులు నిర్వర్తించే సంబంధిత శాఖల అధికారులు ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించడమే కాకుండా పొంతన లేని సమాధానాలతో కాలయాపన చేస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు జీహెచ్‌ఎంసీలో ప్రజలకు సమస్యలను సృష్టించేది అధికారులేనంటూ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులే అధిక సంఖ్యలో వచ్చాయి. అధికారులు సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ తనను అనారోగ్యం పాలు చేశారంటూ శేరిలింగంపల్లి జోన్ రాయదుర్గం ప్రాంతానికి చెందిన గాయత్రి ప్రజావాణిలో దరఖాస్తు చేస్తూ బోరున విలపించారు. అక్రమ కట్టడాన్ని చేపడుతున్నారంటూ ఫిర్యాదు చేశానని.. చర్యలు తీసుకోవాలంటూ.. అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. పైగా అక్రమార్కులతో చేతులు కలిపిన టౌన్ ప్లానింగ్ అధికారులు.. అక్రమ కట్టడాలకు అండగా దగ్గరుండి కట్టడాలకు సహకరించారంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తనకు జరిగిన అన్యాయం పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ మేయర్, ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. మొత్తంగా ప్రధాన కార్యాలయంలో 45 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు.



అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలంటూ...ప్రజావాణిలో దరఖాస్తు చేసేందుకు వచ్చి.. కన్నీటిపర్యంతమైన రాయదుర్గం ప్రాంతానికి చెందిన గాయత్రి

### వెల్లువలా ఫిర్యాదులు

గ్రేటర్ హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి దరఖాస్తుల వెల్లువలా వచ్చాయి. మూడు నెలలుగా రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా ప్రజావాణి నిలిచిపోయింది. ఈ నెల 6న కోడ్ ముగియడంతో సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. బల్దియా కమిషనర్ రొనాల్డ్ రాస్ వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమ్రపాలి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చినా.. సరైన పద్ధతిలో స్పందించడం లేదని చెప్పారు. తప్పులు చేసిన వారికి సహకరిస్తూ ఇబ్బందులు పడుతున్న వారికి అన్యాయం చేసే విధంగా అక్రమార్కులకు సలహాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారంటూ బాధిత ప్రజలు అధికారుల ముందు తమ గోడును చెప్పుకున్నారు. ఏండ్ల తరబడి అధికారుల దృష్టికి సమస్యలను తీసుకొచ్చినా.. జోనల్ ఆఫీస్, సర్కిల్ ఆఫీస్ ల చుట్టూ తిప్పడమే తప్ప ఎలాంటి ప్రయోజనం లేకుండా అధికారులు వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక వర్షాకాలం ప్రారంభం అయినా ఇప్పటికీ నాలాల్లో వ్యర్థాలను తొలగించలేదని, ప్రజావాణిలో మేయర్‌కు బీజేపీ కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు.

**కలెక్టరేట్‌లో..**

మేడ్చల్, సిటీబ్యూరో: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 62 దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. మేడ్చల్ కలెక్టరేట్‌లో ప్రజల నుంచి 90 దరఖాస్తులను స్వీకరించారు.

# గోదావరి నీళ్లకు కటకట

## అడుగంటుతున్న 'ఎల్లంపల్లి'..అప్రమత్తమైన జలమండలి

**15 నుంచి అత్యవసర పంపింగ్‌తో సిటీకి గోదావరి జలాలు**

**రోజూ 172 ఎంజీడీల తరలింపు..**



సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ ) : నగర దాహార్తిని తీర్చడంలో ముఖ్యభూమిక పోషించే ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఆందోళనకరంగా మారడంతో జలమండలి అప్రమత్తమైంది. ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటి నిల్వలు 4.5 టీఎంసీల మేర ఉండగా, డెడ్ స్టోరేజీ 3.3 టీఎంసీల మేర రాగానే అత్యవసర పంపింగ్ అవసరం పడుతుంది. అయితే నెలకు దాదాపు ఒక టీఎంసీ మేర ఎల్లంపల్లి ద్వారా నగరానికి గోదావరి నీటిని తరలిస్తున్నారు. నాలుగు టీఎంసీలకు చేరగానే అత్యవసర పంపింగ్ ద్వారానే రోజూ 172 ఎంజీడీలను తరలించే ఆస్కారం ఉంటుందని భావించిన అధికారులు.. ఎల్లంపల్లి రిజర్వాయర్ బ్యాక్ చానెల్ ముర్మూర్ ఫోర్‌సోర్ వద్ద అత్యవసర పంపింగ్ మోటర్లను ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఏడు పంపులను సిద్ధం చేస్తున్నారు. ఈ ఏర్పాట్లకు సంబంధించి మంగళవారం ట్రాన్స్‌మిషన్ విభాగం క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. 15వ తేదీ నుంచి అత్యవసర పంపింగ్ ప్రారంభించి.. గోదావరి జలాలను తరలించనున్నారు.

### 2016 తర్వాత మళ్లీ ఎత్తిపోతలు

ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి కాళేశ్వరం నీటి రాకతో ఇక అత్యవసర తరలింపు అనేది లేకుండా సంవత్సరం పొడవునా రోజూ 172 మిలియన్ గ్యాలన్ల నీటి తరలింపు సజావుగా జరిగేది. వాస్తవంగా వర్షాభావ పరిస్థితులున్న సందర్భాల్లో కడెం నుంచి ఎల్లంపల్లిలోకి నీరు రావడం ఆలస్యమైన సందర్భాల్లో మాత్రమే జలమండలి అధికారుల్లో అందోళన నెలకొనేది. ఎల్లంపల్లి ఎఫ్ఆర్ఎల్ (ఫుల్ రిజర్వాయర్ లెవల్) 148 ఉండగా, 138.5 మినీమం డ్రా లెవల్‌కు రాగానే ఎల్లంపల్లి నుంచి అత్యవసర పంపింగ్ ద్వారా నీటిని నగరానికి తరలించాలనే ప్రతిపాదనను జలమండలి అధికారులు తీసుకొచ్చేవారు. ఎమర్జెన్సీ పంపింగ్ దాదాపుగా ఆరేడు కోట్ల రూపాయల నిధులు ఖర్చుతో కూడుతున్నది. గోదావరి జలాల తరలింపు ప్రక్రియలో 2016లో ఒక్కసారి మాత్రమే ఎల్లంపల్లి నుంచి అత్యవసర పంపింగ్ ద్వారా నీటిని తరలించిన సందర్భాలున్నాయి. ఎల్లంపల్లి బ్యారేజీలో నీటి నిల్వ తగ్గిన కొద్దీ ఆ ప్రభావం నగరంపై పడేది. అయితే కాళేశ్వరం ప్రాజెక్టుతో గ్రేటర్‌లో గోదావరి నీటిపై ఆధారపడిన ప్రాంతాల తాగు నీటికి శాశ్వత పరిష్కారం దొరికినట్లైయింది. ఎల్లంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా పనిచేయడంతో ఏడాది పొడవునా నీటి తరలింపు సులువు కావడంతో దాదాపు 8 సంవత్సరాలు అటు ప్రజలతో పాటు జలమండలికి ఊరట లభించింది. కానీ కాంగ్రెస్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టు ఆశించిన స్థాయిలో వినియోగంలోకి లేకపోవడంతో ఎల్లంపల్లి రిజర్వాయర్ నీటి నిల్వలు ఆందోళనకరంగా మారాయి. ఎల్లంపల్లిలో గరిష్ఠ స్థాయి నీటి మట్టం 485.560 అడుగులు కాగా, ప్రస్తుతం సోమవారం నాటికి 458.257 అడుగుల మేర ఉంది. జలమండలి అప్రమత్తమై అత్యవసర పంపింగ్ వైపు అడుగులు వేసింది. గోదావరి పరీవాహక ప్రాంతంలో ప్రస్తుతం ఆడపాదడపా వర్షాలు కురుస్తున్నా..ఆశించిన స్థాయిలో ఇన్‌ఫ్లో రావడం లేదని, వర్షాకాలం కావడంతో కొద్ది రోజులు మాత్రమే ఎత్తిపోతలు ఉండే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు నాగార్జున సాగర్‌లో అత్యవసర పంపింగ్ కొనసాగుతున్నది. నగరానికి అవసరమయ్యే 270 మిలియన్ గ్యాలన్ల నీటిని మూడు దశల్లో తరలిస్తున్నారు. సాగర్ పూర్తి నీటి మట్టం 590 అడుగులు కాగా ..504 అడుగుల మేర ఉంది. 500 అడుగుల వరకు ఎత్తిపోతల ద్వారా నగరానికి నీటిని అందించిన సందర్భాలు గతంలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

## ముందస్తు జాగ్రత్తలపై శిక్షణ



సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ ) : వర్షాకాలంలో ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయ చర్యలపై జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం విభాగం శిక్షణను ఇచ్చింది. నాగోల్ ఫతుల్లాగూడలోని ట్రైనింగ్ సెంటర్‌లో సోమవారం ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వరదలతో ముంపు, ప్రాణాపాయ పరిస్థితులు, ఆస్తి నష్టం జరుగుతున్నందున ముందస్తు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలి? ప్రమాదం జరిగినప్పుడు ఏమి చేయాలి అన్న విషయాలపై ఒక్క రోజు శిక్షణ ఇచ్చినట్లు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. 160 మంది వలంటీర్లు పాల్గొన్నారన్నారు. ఆసక్తి ఉన్న అపార్ట్‌మెంట్, బస్తీవాసులు, ఎన్జీవో సభ్యులు, ట్రేడ్ యూనియన్ సభ్యులకు ఉచిత శిక్షణ అందిస్తామని, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 7981665687 నంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

## 'ఓపెన్ ఫర్ ది ప్లానెట్ క్లీనథాన్'



సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ ) : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని యాక్సిస్ బ్యాంకు ఆర్గనైజర్స్ ఆధ్వర్యంలో సోమవారం దుర్గం చెరువు, గోల్కొండ ఫోర్ట్‌లో 'ఓపెన్ ఫర్ ది ప్లానెట్ క్లీనథాన్' పేరిట పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 600 మంది వాలంటీర్లు పాల్గొని పర్యాటక ప్రాంతాలైన దుర్గంచెరువు, గోల్కొండ ఫోర్ట్‌లో 1310 కేజీల వ్యర్థాలను సేకరించారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై స్థానికులకు వలంటీర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు యాక్సిస్ బ్యాంక్ ప్రెసిడెంట్ ఆర్నికా దీక్షిత్ నిర్వాహకులను అభినందించారు.

# తీర్మానాలు లేకుండా పనులేంటి?

**పెండింగ్ పనులు ఎందుకు చేయడం లేదు..**

**కమిషనర్, అధికారులపై ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆగ్రహం**

**పక్షపాత ధోరణితో పనిచేస్తున్నారంటూ మండిపాటు**



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జూన్ 10: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కన పెట్టి.. తీర్మానం చేయకుండా రూ. 12 లక్షల నిధులతో షో లైట్లు ఎలా ఏర్పాటు చేస్తారని బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి. నాలుగు రోజుల కిందటే అభివృద్ధి పనులపై సమీక్ష ఉన్నదని చెప్పినా..నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడ్డారు. కమిషనర్, ఇతర అధికారులు ఎందుకు పక్షపాత ధోరణిలో పనిచేస్తున్నారని ప్రశ్నించారు. తీరు మార్చుకోకపోతే ఇబ్బంది అవుతుందన్నారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బడంగ్‌పేటలో ప్రధాన రహదారిపై స్తంభాలు వేయిస్తే తెలియకుండా షో లైట్లు ఏర్పాటు చేయడం పై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా తనకు ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహించారు. 'అంతా మీ సొంత ఆలోచనతో చేస్తున్నారా' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల ముందే బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం ఉన్నదని చెప్పినా.. కమిషనర్ రఘుకుమార్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆమె మండిపడ్డారు. వర్షాకాలం వచ్చిన తర్వాత కూడా ఎస్ఎన్‌డీపీ నాలా పనులు పక్కన పెట్టి హైమాస్ట్ లైట్లు ఉండగా, స్తంభాలకు షో లైట్లు పెట్టమని ఎవరూ చెప్పారని ఆమె నిలదీశారు. టెండర్ లేకుండా పనులు ఎలా చేస్తారన్నారు. రూ.12 లక్షలతో కొంత మేరకు పనులు చేసి మరో రూ.12 లక్షలు బిల్లు పెడుతారా.. అని అన్నారు. లైట్లు వేసిన కాంట్రాక్టర్ శ్రీనివాస్ గౌడ్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేశారు. ఎవరూ చెబితే పనులు చేశావంటూ.. ప్రశ్నించారు. వేసిన లైట్లు తీసుకొని వేరే చోట వేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ఉండగా, ఎలాంటి తీర్మానాలు లేకుండా పనులు చేయడం పట్ల ఆమె మండిపడ్డారు. ఒక వర్గం వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని, తాము చెబితే కమిషనర్ పనులు చేయడం లేదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ప్రభుత్వ భూములు, పార్కులు, సీలింగ్ భూములు, , వర్క్ బోర్డు భూముల్లో డోర్ నంబర్లు ఇస్తున్నారని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. చాలా వరకు పనులు అసంపూర్తిగా ఉన్నా.. వాటిని పట్టించుకోకుండా కొత్త వాటిని చేయాలని ఎందుకు అనుకుంటున్నారని, ఏ వార్డుకు ఎన్ని నిధులు కేటాయించారో పూర్తి సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే అన్నారు. టెండర్ లేకుండా పనులు చేయకూడదన్నారు. నాలా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, కమిషనర్ రఘుకుమార్, డీఈ జ్యోతి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



*మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ (61) సోమవారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందారు. మారేడ్‌పల్లిలోని రాధిక కాలనీలో శంకర్ యాదవ్ పార్థివ దేహానికి మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు పూలమాల వేసి నివాళులర్పించారు.*

*- మారేడ్‌పల్లి, జూన్ 10*

# జలమండలి చలివేంద్రాలు కొనసాగించాలి

## వర్షాకాల ప్రణాళికపై సమీక్షలో జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ ): వర్షాకాలంలో కలుషిత నీరు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున అధికారులు తగిన మోతాదులో క్లోరిన్ శాతం ఉండేలా చూసుకోవాలని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి సూచించారు. శాంపిల్ కలెక్షన్, పరీక్షల్లోనూ జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. సోమవారం ఖైరతాబాద్ సంస్థ ప్రధాన కార్యాలయంలో వర్షాకాల ప్రణాళికపై ఎండీ సుదర్శన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. డివిజన్ల వారీగా వాటర్ లాగింగ్, స్టాగ్నేషన్ పాయింట్లను గుర్తించి నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, డీప్ మ్యాన్‌హోళ్లకు గ్రిల్స్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కలుషిత నీటిపై వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యమిస్తూ మిగిలిన వాటిని కూడా సకాలంలో పరిష్కరించాలని ఎండీ పేర్కొన్నారు. ప్రజావాణి, సోషల్ మీడియాల్లో వచ్చే ఫిర్యాదులపైనా దృష్టి సారించాలని వివరించారు. ఈఆర్టీ టీమ్స్ బృందాలపై ఆరా తీశారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి జలమండలి ఏర్పాటు చేసిన చలి వేంద్రాలను కొనసాగించాలని ఎండీ సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. జన సంచారం ఎక్కువగా ఉండే వైద్యశాలలు, బస్టాండ్‌లు వంటి ప్రాంతాల్లో చలివేంద్రాల కొనసాగింపునకు నిర్ణయం తీసుకున్నారు. నిత్యం జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో తాగునీరు అందించాలని ఎండీ తెలిపారు. డివిజన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు పరిశీలించారు. ఎప్పటికప్పుడు బిల్లులు వసూలు చేయాలన్నారు. గృహ వినియోగదారులతో పాటు వాణిజ్య కనెక్షన్లపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా మొండి బకాయిదారులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎండీ చెప్పారు. ఎంతో కాలంగా బిల్లులు చెల్లించని వినియోగదారులతో ఫోన్ చేసి మాట్లాడాలని సూచించారు. ఈ సమీక్షలో డైరెక్టర్లు అజ్మీరా కృష్ణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.